# కోలాహలం హాలాహలం

— రాంపా




ఆ ఆఫీసులో ఓ ఉద్యోగి పని ఎగ్గొట్టడంలో మంచి పనితనం వున్నవాడు. ఆ నిపుణుడి శుభనామం కోలాహలం. ఆఫీసరు పేరు హాలాహలం.

ఆరోజు ఆఫీసంతా కోలాహలం లేకుండా కోలాహలంగా ఉంది. హెడ్డాఫీసుకి వెళ్లిన హాలాహలం రావడానికి మరో పది నిమిషాల వ్యవధి వుంది. దొరికిన సమయాన్ని వృథా చేయకుండా లేని వాళ్లను ఆడిపోసుకోవడమనే కళాప్రదర్శన మొదలయింది.

కేవలం నోటి దురుసు తీర్చుకోడానికి హాలాహలం ఆఫీసరయ్యాడు గాని ఓ రూలు తెలుసా, రెగ్యులేషన్ తెలుసా"

"అవి మన దగ్గరే తెలుసుకుని మనకు ఎసరు పెట్టడం తెలుసు గదరా"

"హాలాహలం పొగలకు, సెగలకు ఒక పక్క మనం వుడికి పోతుంటే ఈ కోలాహలం గాడొకుడు నెలలో పది లీవులు, యిరవై పర్మిషన్లూ పీడూమా. వాడో అధికారి, వీడో అనధికారి అయ్యారు. మన పాలిటికి"

"పొద్దున వచ్చిం దగ్గర మంచి సాయంత్రం యింటికెళ్ళిందాకా ఎత్తిన తల దించకుండా రోజూ పరీక్ష రాసినట్టే వుంటుంది బతుకు. అయినా ఒక్క పూట సెలవు కావాలంటే పది రోజులు ముందు పర్మిషనుండాలి మనకు"

"ఈ కోలాహలం ఆఫీసొదిలేసి చేసే పనులేముంటాయో ఏమో. బోడి ఉద్యోగానికి న్యూటరొకటి. చైనెప్పుడూడి పోతుందో తెలియని సైకిళ్ళ స్థాయి మనది"

"వాడి రాత వాడిది. దేనికదేరా. మంచి మాటకారి"

"ఆ! మాటక్కారి"

ఇంతలో ఓ పిల్లవాడు బౌండరీ దాటి బంతి నాపడానికొస్తున్న ఓల్డరులాగా వచ్చాడు. 'కోలాహలం అంకుల్ వున్నాడా' అనడుగుతూ.

'ఆ బాలగోపాలానికి' కావల్సిన వాడే నవమాట కోలాహలం. ఆ పెద్దమనిషితో నీకేం పని బాబూ' అడిగాడో గుమస్తా.

'సరే! లేడని తెలుస్తూనే వుంది. ఎప్ప డొస్తాడో చెబుతారా పోనీ" అడిగాడు పిల్లవాడు.

"మాకు తెలిస్తేగా నీకు చెప్పేది. మా అజ్ఞానాన్ని మన్నించు బాబూ" అన్నాడో గుమస్తా.

"డోంట్ వర్రి అంకుల్స్" అనుకుంటూ వెళ్ళి హాలాహలం కుర్చీలో కూర్చున్నాడు.

"వామ్మో! ఎక్కడపడితే అక్కడ కూర్చోకు బాబూ! మా పులి వచ్చే వేళయింది.' అంటూంటేనే హాలాహలం హడావిడిగా వచ్చాడు.

"ఎవరయ్యా! ఈ గడుగ్గాయి! ఆఫీసుకి పిల్లల్ని తీసుకు రావొద్దని ఎన్ని సార్లు చెప్పాలి" అరిచాడు హాలాహలం.

"ఎవరూ తీసుకురాలే నేనే వచ్చాను. ఎందుకు అనవసరంగా అంతంత వాళ్ళని అరుస్తారు. నేనెవరో నన్నే అడగండి చెబుతా" అన్నాడు వాడు.

"సరే! ఎవరండీ తమరు" అడిగాడు హాలాహలం వంగి చేతులు కట్టుకుని.

"నేను మీ పక్కాఫీసు స్టెనో సుందరి కొడుకుని కోలాహలం అంకుల్ కోసం వచ్చాను' ' చెప్పాడు వాడు.

"అవును మన ఆఫీసులో కోలాహలం అనే ఒకతను ఉద్యోగం చేస్తున్నాడు గదా! వాకే అన్ని గుర్తుకొస్తున్నాయి. ఆ కోలాహలానికే ఆఫీసుందని, ఆఫీసులో పనుందని గుర్తుకు రావడం లేదు" అంటున్న మరుక్షణమే కోలాహలం మంచి ఫోను వచ్చింది సార్. తీవ్ర శారీరిక అవస్థ, అస్వస్తత! ఆఫీసుకి వచ్చే స్థితిలో లేను. ఏదో చేతికింద కమండలం లాగా మా ఆవిడ వుండబట్టి టెలిఫోన్ బూత్‌దాకా వచ్చాను. దయచేసి యివ్వాళ సెలవుగా భావించండి" అన్నాడు కోలాహలం బాధోతప్త స్వరంతో

"సరే! నీరసంగా వున్నట్టున్నావ్! వెళ్ళి

పడుకో! వీడెవడో గడుగ్గాయి సుందరి కొడుకట సర్లే! వాడికి బిస్కెట్ ప్యాకెట్ కొనిస్తాను. నువ్వు రెస్టు తీసుకో". చెప్పాడు హాలాహలం.

** ** **

మర్నాడు ఆఫీసులో

"ఏమయ్యా! వున్నట్టుండి సెలవ్ అని ఫోన్ చేస్తే సరిపోయిందా యిక్కడ నీ పని ఎవరు చేస్తారనుకున్నావ్' గొంతెత్తి అరిచాడు హాలాహలం.

"అదేంటి సార్! వంట్లో బాగోలేదని చెప్పానుగా. మీ రొప్పకున్నారుగా" అన్నాడు కోలాహలం.

"అవును చెప్తావ్! అయ్యో పాపం అని నాకు తెలిసిన హోమియో పిల్సని, ఓ ఆయుర్వేద చూర్ణాన్ని, నాలుగు ఎల్లోపతి మందుల్ని తీసుకుని నీ యింటి కొస్తుంటే జలసాగా భార్యని వెనక కూర్చో బెట్టుకుని స్కూటర్‌మీద రయ్‌మని వెళ్తూ దర్శనమిచ్చావ్" అన్నాడు హాలాహలం.

'నన్నంటె గుర్తు పట్టలేదనుకుంటాను.. ఎవర్నో చూసి మా ఆవిడనుకోవడం బాగోలేదుసార్! నన్నాపి మాట్లాడించారా! నేను మిమ్మల్ని చూశానా! అసలది నేను కాదు. నన్ను రెడ్ హేండడ్‌గా పట్టుకుందామని అనుమానంతో వున్న మీకు నేననే అనిపించుంటా అదే మీరు మా యింటి కొచ్చుంటే బెడ్ మీద నన్నూ, నా నోట్లో ధర్మామీటర్నూ, అది పగిలిపోయేంత జ్వరాన్నీ చూసేవారు" అని రెట్టించిన స్వరంతో ఎదురు అరిచాడు కోలాహలం. 'సర్లే! ఏదో అయింది. ఆఫీసు పని చూడు' అన్నాడు. చిల్లిపడ్డ బెలూన్‌లోంచి వచ్చేగాలిలా.

** ** **

మళ్ళీ ఒక రోజు అదే వంక చెప్పి ఆఫీసెగ్గొట్టి మర్నాడు యధావిధిగా గంటలేటుగా ఆఫీసుకొచ్చాడు కోలాహలం.

"ఏమయ్యా! అప్పడేదో పెద్ద లాజిక్కు మాట్లాడావుకదాని. ఈసారి సరాసరి మీ యింటికొచ్చా ఓ డాక్టర్ని కూడా వెంటబెట్టుకుని. ఇంటికి పెద్ద తాళం వేసుంది" దొంగ దొరికాడన్న ఆనందంతో అన్నాడు హాలాహలం.

"తాళం వేసుంది సరే! గొళ్ళెం వేసుందో లేదో చూశారా! లేదు. చుట్టు పక్కల నుంచి పరామర్శలెక్కువై తలనొప్పి తెస్తున్నారని వాళ్ళ బాధ భరించలేక యింట్లో ఎవరూ లేనట్లు భ్రమింప చేద్దామని అలా చేశానంతే. తాళం పట్టుకుని చూసుంటే తెలిసేది ఎదురు దాడి చేశాడు కోలాహలం.

"ఎందుకయ్యా! అలా గొంతు చించుకుంటావ్! నేను విన్నేమన్నా అన్నానా. అసలే పడిలేచిన వాడిని ఆరోగ్యం జాగ్రత్త" అన్నాడు హాలాహలం లాలనగా.

"నాకు తెలుసు సార్! మీ మాట పులి మనసు పిల్లి అని" అన్నాడు కోలాహలం.

"అట్టా అరిచ్చస్తావుగాని నీవు మాత్రం నిజంగా రౌడీవటయ్యా ఆ. మర్చిపోయా! స్టైనో సుందరి వచ్చి వెళ్ళింది. నువ్వేదో నంది అవార్డ్ ఫంక్షను కాంప్లిమెంటరీ పాస్ యిస్తానన్నావటగా" అన్నాడు హాలాహలం ఓ అర్థం కాని చూపుతో.

పుట్టిదే సార్! నేను ఆఫీసుకి రాలేదనగానే మీ మనసులో నా మీద ఏవో అనుమానపు గింజలు మొలకెత్తించాలని ఆ అమ్మాయి కాదు కాదు ఆవిడ అలా చెప్పి వుంటుంది. నాకు సినిమాలు ఫంక్షన్లు అంటే అంత మోజు లేదని మీకు తెలుసుగా సార్" అన్నాడు కోలాహలం.

"ఇదిగో కోలాహలం! వాదేమన్నా మట్టి బుర్రా గింజలు మొలకెత్తడానికి చెప్పుడు మాటలకు చెవులప్పగించేవాణ్ణి కాదయ్యా నేను. నా స్వంత పరీక్షలు నాకుంటాయి" అన్నాడు హాలాహలం తల నవరించుకుంటూ.

** ** **

ఒకరోజు ఆఫీసరు హాలాహలమే లేటుగా వస్తూ కోలాహలం యింటి దగ్గరున్న టెలిఫోన్ బూత్ పక్కన కోలాహలం స్కూటర్ చూసి ఆపాడు. నిశ్శబ్దంగా వెళ్ళి కోలాహలం వెనక నిలుచున్నాడు.

"హలో సార్! అదేంటోసార్! ఈ వెంట వెంట జ్వరాలేంటో నాకూ అర్థం కావట్లేదు. నేను వాడే మందులకూ అర్థం కావట్లేదు. మీరేమో కొండంత తెలివైన వారు. ఏదైనా యిట్టే అర్థం చేసుకుంటారు. అదే సార్! సెలవా" అని ఫోన్ పెట్టేసి వెనక్కు తిరిగి హాలాహలాన్ని చూశాడు. మొహంలో ఏ స్పందనా లేదు.

"ఏమయ్యా కోకో కోలాహలం, మళ్ళీ జ్వరమొచ్చింది. యిది రెడ్ హేండడ్ క్యాచ్ కాదా' ' అన్నాడు హాలాహలం.

"కాదుసార్! మీరిటు వస్తున్నట్టు చూసే మీకా ఆనందం కలిగించాలనే అలా చెప్పా. నాకు తెల్సు సార్. యివ్వాళ మీరు లేటుగా వస్తూ నా గురించి ఆఫీసుకి ఫోన్ చేసి నాకబు చేశారని" నిశ్శబ్దంగా చెప్పాడు కోలాహలం.

హాలాహలం తాగిన మొహం పెట్టాడు హాలాహలం!

సార్! యింతెందుకుగాని మీకొచ్చే జీతంతో మీరూ, నాకొచ్చే జీతంతో నేనూ బతకడం కష్టంగానే వుంది. పక్కా సంపాదనలు సంపాయించే తెలివి మీకూ లేదు, నాకూ లేదు. ఎలాగైనా నన్ను పట్టుకుని నా పని పెట్టాలని మీ పట్టుదల. మీకే దొరికితే నా బుర్రెందుకు దండగ మర్రి చెట్టు ఊడకు కార్చే బంకకు పట్టే చీమైపోనూ- - అని నేను. అందుకని మనం పందెం పెట్టుకుందాం. నేను మీకు దొరికితే ఐదొందలిస్తా. దొరక్కపోతే మీరు ఐదొందులివ్వాలి" చెప్పాడు కోలాహలం.

"ఎందుకయ్యా! బికారివై బజార్న తిరుగుదామనుకుంటున్నావా నాకున్న మందీ మార్బలం తెలిసే మాట్లాడుతున్నావా" అన్నాడు హాలాహలం.

"మీకున్న మందైనా మార్బలమైనా నేనేగా సార్" అన్నాడు కోలాహలం.

"అన్న తెచ్చైనా సరే పందెం డబ్బులు యివ్వాలి" అన్నాడు హాలాహలం ధీమాగా.

"నేను అదే అంటున్నాను సార్" అన్నాడు కోలాహలం.

నెలలు గడిచి పోతున్నాయి గాని కోలాహలాన్ని ఓడించే మార్గం మాత్రం తోచడం లేదు హాలాహలానికి.

** ** **

"ఏమయ్యా! నేలాకోళాహలం యిదేం బాగోలేదయ్యా! ఇలా నా జీతంలో సగ భాగం నెలనెలా నీకు ధారపోస్తూ వుంటే నా కారు నీకు, నీ స్కూటర్ నాకూ వచ్చేట్టున్నాయి" అన్నాడు హాలాహలం. "సార్! అంత మాట అనకండి సార్! మీ డబ్బు ఒక్కపైసా కూడా నేను వాడుకోలేదు. ఈ మధ్య మీరు మీ ఆవిడని చిన్న చూపు చూస్తున్నారని ఆవిడ చేతి ఖర్చు కింద ఒక్క చిల్లి గవ్వకూడా యివ్వట్లేదని గువ్వలాంటి తన చేతిలో గువ్వలేకపోతే ఎట్లా అని బాధపడితే ఈ ఏర్పాటు చేశా! సంసారం అన్న తర్వాత ఏవో గొడవలొస్తుంటాయి. మీరు మరీ అంత కఠినంగా వుండడం బావుల్లేదు సార్" అన్నాడు కోలాహలం.

"నీకేం తెలుసయ్యా. కోలాహలం. తనో ఆఫీసర్ భార్యననే నిక్కు ఎక్కువయిందయ్యా ఆవిడకి. అధికారుల అర్థాంగుల ఆగడాలు అని పేపర్లలో ఎన్ని వార్తలు రావడం లేదు. అందుకు కొంత కట్టడి చేసిన మాట వాస్తవమే. సరే! నీ ఏర్పాటు బాగానే వుంది గానీ నువ్వు నీ భార్యకు చేస్తున్న అన్యాయం ఎవరూ సహించలేరయ్యా! నువ్వా స్టైనో సుందరితో తిరగడాలు మానుకోవడం మంచిది" అన్నాడు హాలాహలం.

"సార్! దెబ్బతిన్నారు సార్! సుందరి ఎవరో కాదు. నా మరదలే సుందరి కొడుకుగా వచ్చింది నా కొడుకే. మీకూ నాకూ స్పర్థ పెట్టి మీతో నాకు చార్జి షీటు యిప్పించేట్లు చేస్తానంది ఓడిపోయింది" చెప్పాడు కోలాహలం. ●

